క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన రయ్యాన్‌పుట్టిన రోజును పురస్కరించుకుని రోగులకు ట్రాఫిక్ ఎస్‌ఐ ఎన్‌యండి రఫీ పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యుడు మహేశ్వరరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు హరీష్ చంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

వేసవి వినోదం

రాయచోటి టౌన్ : ఈ నెల 8వ తేదీ నుంచి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోదం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాయచోటి మండల కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు తెలిపారు. రాయచోటి కొత్తపేట విజ్ఞాన్ స్కూల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 7 లోగా 94908 57161, 95506 05575 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలి పారు.

విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు పత్రాలను అందజేయండి

సిద్దవటం: జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలు పూర్తి అయిన లబ్ధిదారులు విద్యుత్ మీటరు ఏర్పాటుకు తమ ఆధార్‌కార్డు, ఇంటి పట్టా మంజూరు పత్రాలు, మొబైల్ నెంబరు, ఫోటోలను సచివాలయాల్లోని జేఏల్‌ఎంకు అందజేయాలని ఈఓపీఆర్‌డీ బి. పులిరామ్‌సింగ్ తెలిపారు. సిద్దవటంలోని జగనన్న కాలనీలోని ఇంటి నిర్మాణ పనులను శుక్రవారం ఈఓపీఆర్‌డీ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, సుప్రజ, ఇంజనీరింగ్ అసిస్టెంటు శివ పాల్గొన్నారు.

– సిద్దవటం సచివాలయాన్ని శుక్రవారం ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.

రేపు మాచుపల్లెలో బండలాగుడు పోటీలు

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామంలో శ్రీ రేణుకా యల్లమాంబ తిరుణాల సందర్భంగా ఆదివారం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం అమ్మవారికి బోనాలు , మొక్కుబడులను చెల్లించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన యడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ. 1,00,116, రెండవ బహుమతి రూ. 70,116, మూడవ బహుమతి రూ. 50,116, నాల్గవ బహుమతి రూ. 30, 116, ఐదవ బహుమతి రూ. 20,116 అందజేస్తామన్నారు.


మహావ్యక్తి కారల్‌మార్క్స్

రాయచోటి అర్బన్ : మానవజాతి చరిత్రను మలుపుతిప్పిన మహావ్యక్తి కారల్‌మార్క్స్ అని సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు రామాంజులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కారల్‌మార్క్స్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం నేతలు రామచంద్ర, సిద్ధమయ్య, సురేంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

కమనీయం... కల్యాణం

సిద్దవటం: మండల శివారులోని జె.ఎం.జె కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు, భారతి దంపతులు, వీరి కుటుంబ సభ్యులు స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. వేద పండితులు ప్రతాప్ శర్మ, నరేష్‌శర్మలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. వైఎస్‌ఆర్ సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి హాజరై కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరి రెడ్డి, దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు, రాజానాయుడు, రిటైర్డ్ తహసీల్దారు గంగులయ్య, మాజీ గ్రంథాలయ చైర్మన్ రామకోటిరెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి పాలెం చిన్న సుబ్బరాయుడు, భక్తులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట



రోగులతో మాట్లాడుతున్న హిమదేవి

సిద్దవటం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు, వైద్యానికి పెద్దపీట వేశారని , వైద్యులు కూడా ప్రజాసేవకు పాటుపడాలని డీసీహెచ్‌ఎస్ హిమదేవి వైద్యులకు సూచించారు. సిద్దవటం లోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రోగులతో మాట్లాడుతూ ఇక్కడి వైద్య సేవలు బాగా అందుతున్నాయా, కావలసిన మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనంను సందర్శించి ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుశేఖర్, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ వరప్రాసాద్, డాక్టర్ లీలాకిరణ్మయి పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే సంక్షేమ విప్లవం

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో జగనన్న పాలనలోనే సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 32, 33 వార్డులలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ని బ్రహ్మణవీధి, రవితేజ ఆసుపత్రి వీధి, రవీంద్రభారతి స్కూల్‌వీధి, గౌరమ్మ బుగ్గ వీధి, తొగటవీధి, శివాలయం వీధిల లో కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, పాలకవర్గం సభ్యులు, అధికారులతో కలసి ఆయన గడప గడకు వెళ్ళి ప్రజాసమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం నుండి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును తెలుసుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ఆధారంగా అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతంపైగా ఇప్పటికే సీఎం జగన్ నెరవేర్చేశారంటూ చెప్పారు.

ప్రజలతో మమేకం..

కార్యక్రమంలో భాగంగా ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రజలతో మమేకం అయ్యారు. ఉర్దూపాఠశాల వెనుకవీధికి చెందిన నసీబ్‌జాన్ తాను ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం పొందినట్లు , జగనన్న మేలు మరువలేనంటూ కృతజ్ఞతలు తెలిపారు. కొలిమివీధిలో వహిదా ఇంటి ముందు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని మార్చి ప్రత్యమ్నాయచర్యలు చేపట్టాంటూ అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతంలో పాఠశాల ముందు వీధిలో సిమెంటురోడ్డు నిర్మాణాలు, శివాలయం వీధిలో డ్రైనేజికాలువను నిర్మిస్తామంటూ హామీ ఇచ్చారు.

– కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్‌లు జ్యోత్స్న, గువ్వల లక్ష్మిదేవి, నేతలు బేపారి మహమ్మద్ ఖాన్, గువ్వల బుజ్జిబాబు, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సురేష్, వెంకటేష్, ఈశ్వర్‌ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి, గౌస్‌ఖాన్, జగదీష్, యుగంధర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి: ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రైల్వేకోడూరు: సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

కాలభైరవుడికి విశేష పూజలు

రాయచోటి టౌన్ : యండపల్లె సమీపం కొండపై వెలసిన శ్రీ కాలభైరవుడికి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పూజలు నిర్వహించారు. శనివారం శ్రీకాలభైరవుడి తిరుణాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, బీసీ నాయకులు పల్లపు రమేష్, ధర్మారెడ్డి, అమరనాథరెడ్డి, ఎర్రబయన్న, నల్ల బయన్న, కిరణ్, గంగాధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

పేదలకు ఆర్థిక భరోసా అందించడమే ప్రధాన లక్ష్యం

రైల్వేకోడూరు : రాష్ట్రంలో పేదలకు ఆర్థిక భరోసాను అందించడమే ప్రధాన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను అందిస్తున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలోని పాటుమీదపాలెం, త్రిమూర్తినగర్, గుర్రప్పపాళెం ఎస్టీకాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన ప్రయోజనాలను బుక్‌లెట్లతో వివరించారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 98.5 శాతానికి పైబడి నెరవేర్చామన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. సీఎం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందించేందుకు ఏర్పాటుచేసిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శవంతమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ మండల నాగేంద్ర, జెట్పీటీసీ రత్నమ్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, శ్రీకారం శివయ్య, మస్తాన్, నాగమణెమ్మ, కొరముట్ల శేఖర్, ఎంపీడీవో నాగార్జున, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధితో రైతులకు లాభం

చెరువుల అభివృద్ధి వలన ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో లాభం చేకూరుతుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలోని చౌడవరం చెరువుకు రూ. 47.80 లక్షలతో చెరువు మరమ్మతు పనులను ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నో పథకాలను ప్రవేశపెడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలోని చెరువులు, కుంటల మరమ్మతులు చేయడంతో చెరువుల్లో నీటి సామర్థ్యం పెరిగి ఆయకట్టు రైతులు పంటలు సమృద్ధిగా పండించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ చంగల్రాయుడు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఏపిటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, సుధాకర్‌రాజు, సిహెచ్.రమేష్, శ్రీకారం శివయ్య, కొరముట్ల శేఖర్, తుమ్మల సురేష్, మత్తయ్య, మస్తాన్, కాంట్రాక్టర శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీలుగలు పంపిణీ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండలంలో శనివారం నుంచి జీలుగలు, జనుములు పంపిణీ చేస్తున్నట్లు శుక్రవారం ఒంటిమిట్ట వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలానికి 100 క్వింటాల జీలుగలు, 40 క్వింటాల జనుములు వచ్చినట్లు చెప్పారు. వీటిని 50 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జీలుగలు పూర్తి ధర కిలో రూ. 79 ఉండగా రాయితీ కింద రూ. 39.50 ఇస్తామన్నారు. జనుములు పూర్తి ధర కిలో రూ. 84 ఉండగా, రాయితీ కింద రూ. 42 కి ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు స్థానిక ఆర్‌బీకే కేంద్రాలకు తమ పట్టాదార్ పాస్ బుక్, ఆధార్ కార్డు, ఫోన్ తీసుకొని రావాలని తెలియజేశారు.

ఆకట్టుకున్న అన్నమయ్య కీర్తనలు




అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

పెనగలూరు: శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సంలో భాగంగా అన్నమయ్య కీర్తన సంగీత విద్వాంసులు చేపట్టిన అన్నమయ్య కీర్తనలు ప్రత్యేకంగా భక్తులను ఆకర్షించాయి. వెంకటేశ్వరస్వామి భక్తి గీతాలు, అన్నమయ్య కీర్తనలు కళ్యాణోత్సవానికి ముందు భక్తులకు వినిపించారు. భక్తులు కూర్చునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ హేమాద్రి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

పెనగలూరు: మండలంలోని కొండూరు పంచాయతీ, విఎం పురం క్రాస్ రోడ్డు వద్ద సానేపల్లి రామచంద్రయ్య వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ... మండలంలో గస్తీ తిరుగుతుండగా గురువారం సాయంత్రం విఎంపురం క్రాస్ వద్ద 13 మద్యం బాటిళ్లతో రామచంద్రయ్య ఉండగా అతన్ని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. శుక్రవారం నిందితుడ్ని నందలూరు కోర్టుకు హాజరుపరచగా కోర్టువారు రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాబుల్‌రెడ్డి

పుల్లంపేట: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలని, గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు పరిష్కరించాలన్నారు. వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం వైద్య, ఆరోగ్యం తదితర అంశాల గురించి అధికారులతో చర్చించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోగా వెంకటసుబ్బమ్మ, జయశంకర్, తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ ప్రకాశం, మండల కన్వీనర్ ముస్తాక్, వైఎస్సార్ సిపి నాయకులు సుదర్శన్ రెడ్డి, ఎంఈఓ రంగనాథయ్య, అగ్రికల్చర్ ఏఓ కృష్ణ చైతన్య, డాక్టర్ సానేశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నల్లగంగమ్మ జాతర

సంబేపల్లె : జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి జాతర మొలకల పౌర్ణమి సందర్భంగా ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి వేదపండితులచే హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

నల్లగంగమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే, ఎస్పీ

నల్లగంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎస్పీ గంగాధర్‌రావు శుక్రవారం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేపట్టారు. జాతర సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, ఎస్పీ ప్రారంభించారు.



ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ తల్లి



నల్లగంగమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎస్పీ గంగాధర్‌రావు

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రంగు రంగు పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు రాహుకాల విశిష్టతను చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు



రాహుకాల విశిష్టతను వివరిస్తున్న ప్రధాన అర్చకులు శంకరయ్య

వేడుకగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితుడు



స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న పెద్ద గుండాల్ రెడ్డి దంపతులు

పెనగలూరు: పెనగలూరు మండలం, ఈటమాపురం పెంచలకొండ గుట్టపై వెలసివున్న పురాతన కాలం నాటి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి నరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుపతి-తిరుమలకు చెందిన బాలాజీ స్వామి ఆధ్వర్యంలో 11 మంది వేదపండితులు ఈ కళ్యాణాన్ని నిర్వహించారు. పెంచల నరసింహస్వామి ఆలయ ట్రస్టు చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ గుండాల్ రెడ్డి ఈ కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

పట్టువస్త్రాలు సమర్పణ.....

శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి బత్తిన పెద్ద గుండాల్ రెడ్డి, సరస్వతి దంపతులు స్వామివారికి మేళతాళాలతో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అలాగే కల్యాణోత్సవానికి విచ్చేసిన ప్రతి మహిళకు పసుపు, కుంకుమ, జాకెట్, ముత్యాలను అందించారు. అలాగే ఈటమాపురం గ్రామస్తులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెంచులు సాంగెంతో కల్యాణం

లక్ష్మీనరసింహస్వామి వారికి చెంచుల సాంగెం వచ్చిన తరువాతే కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈటమాపురం పంచాయతీలోని చెంచులు స్వామివారికి ఈతచాప, అడవిలోని పలురకాల ఫలాలు, అమ్మవారికి చీర, పండ్లు ఫలాలతో కల్యాణం ప్రారంభించడం ఆనవాయితీ. చెంచులంతా సాంగెం పెద్దఎత్తున తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. పెంచలకోనకు వెళ్లలేని భక్తులంతా పెనగలూరు మండలంతోపాటు ఇతర మండలాల నుంచి తరలివచ్చారు. కల్యాణం అనంతరం స్వామివారిని పురవీధులలో ఊరేగించారు.

ఘనంగా కల్యాణం

రామాపురం : మండల పరిధిలోని బండపల్లెలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి, లక్ష్మీదేవి అమ్మవారికి అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుండి కాకుండా మండల పరిధి నుండి భక్తులు , మహిళలు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండురోజుల నుండి ఆలయంలో ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. రాత్రి సానవుల చిన్నమ్మ బుర్రకథ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయానికి 100 సంవత్సరాలు చరిత్ర కలిగి ఉందని కమిటీ సభ్యులు తెలిపారు.

జగనన్న కాలనీలో నిర్మాణాలు పూర్తిచేయాలి

ఓబులవారిపల్లె: బొమ్మవరం గ్రామంలో జగనన్న కాలనీల్లోని ఇంటి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి బొమ్మవరం గ్రామంలోని జగనన్న కాలనీలను పరిశీలించారు. కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేయించాలని, పనులు పూర్తి చేయాలని , లబ్ధిదారులకు అన్ని విధాల సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీర్ మున్ని , జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటి మడుగు సుధాకర్‌రాజు, స్థానిక నాయకులు వంపన సుధాకర్ పాల్గొన్నారు.

ఘన నివాళి

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నూక శ్రీనివాసులరెడ్డి (సూబ్బారెడ్డి) (55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ,ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటి మడుగు సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పోతురాజు కథ

రామాపురం: మండల కేంద్రంలో మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం 13వ రోజు పోతురాజు కథ కార్యక్రమానికి స్పందన లభించింది. హరిదాసు డీఎంకే సీతాలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ హరికథ ప్రజలకు అర్థమయ్యే రీతిలో గానం చేయడం అందర్ని ఆకట్టుకుంది. ఈ మహాభారత యజ్ఞం కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి, రాయచోటి, తదితర ప్రాంతాల నుండి ప్రజలు తరలివచ్చారు.

రహదారులకు ఆటంకం కల్గిస్తే చర్యలు

గాలివీడు: గ్రామాలలో పురాతన కాలినడక రహదారులకు ఆటంకం కల్గించవద్దని, అలా కాదని ఆటంకం కల్గిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ వెంకట శివకుమార్ అన్నారు. శుక్రవారం గరుగుపల్లి గ్రామం, ఇడపన్ చేనుపల్లిలో చిన్నచిన్న కాలినడక రహదారులకు కొందరు ఆటంకం కల్గిస్తే ఎస్‌ఐ అక్కడికి వెళ్లి వారితో మాట్లాడారు. సమస్య పరిష్కరించారు. మరోమారు ఇటువంటివి పునరావృతం కాకుండా ఒకరికొకరు సర్దుకుని సహకరించాలన్నారు. గ్రామ సర్పంచ్ చింతం రెడ్డి జానకమ్మ, రామాంజులు రెడ్డి, గ్రామ పెద్దలు కూర్చొని సమన్వయంతో చర్చించుకోవాలన్నారు.

బియ్యం ప్యాకెట్లు వితరణ

రామాపురం : మండలంలోని బండపల్లె పంచాయితీ వద్ద గల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శుక్రవారం రాయచోటికి చెందిన మండ్ల అమరనాథ్ రెండవ వర్థంతి సందర్భంగా కుమారుడు శివకార్తీక్ మూడు బియ్యం ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో శివకార్తీక్, రాహుల్, మన్మోహన్, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఓబులవారిపల్లె: మంగంపేట ఏపీఎండీసీలో పని చేసే కార్మికులకు తాగునీరు అందడం లేదని ఉద్యోగ సంఘాల నాయకులు రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి ఆదేశానుసారం తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు శుక్రవారం ఏపీఎండీసీ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ అధ్యక్షులు తల్లెం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రెండురోజులుగా మంగంపేట ఏపీఎండీసీ కార్మికులకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతూ సమస్యల పరిష్కారం కాకుంటే విధులు బహిష్కరిస్తామని ఏపీఎండీసీ వినతిపత్రం అందించడం జరిగిందని, దీంతో ఏపీఎండీసీ ఎండీ వీజి వెంకటరెడ్డి సమస్యలు పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఎస్ సుబ్రమణ్యం, ఓబులేశు, బాలకృష్ణ, కార్యదర్శి సల్మానయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

రామాపురం : మండల కేంద్రంలోగత పది రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞంలో నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మహాభారత యజ్ఞంలో అన్నదాన కార్యక్రమానికి రాయచోటి నియోజకవర్గ శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం ఎంతో పుణ్యకార్యమన్నారు. మహాభారతయజ్ఞం నిర్వహించడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని, అందరూ కలిసి ఇలాంటి కార్యక్రమాలు చేయడంతో ప్రజల్లోభక్తిభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ పార్టీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, రాష్ట్ర యువజన కన్వీనర్ వెంకట సుబ్బారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సత్యాయాదవ్, వెంకటరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, భక్తవత్సలరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడల్లో రాణించిన విద్యార్థులతో ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి

రాజంపేట: ఏఐటీఎస్‌లో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ వేడుకలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆనందాన్ని ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలన్నారు. ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ మనదేశం సంస్కృతి , సంప్రాదాయలకు చిహ్నామన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ ఏఐటీఎస్ నుంచి 9 మంది విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టరు డా.బీ. నాగముని , కల్చరల్ ఇన్‌చార్జి డా.పెంచలయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లి: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఏదైనా ఆహారం తినేముందు చేతులు శుభ్రం చేసుకుని తరువాత ఆహారం తీసుకోవాలని డాక్టర్ ధరణి కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ చేతులు శుభ్రం చేసుకునే దినోత్సవం సందర్భంగా లక్కిరెడ్డిపల్లె కమ్యునిటీ ఆసుపత్రిలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగాలు అనేవి మన విధానం, ఆహారం వల్ల చేతులు ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. చిన్న పిల్లలు ఎక్కడపడితే అక్కడ చేతులు పెట్టి ఆహారాన్ని తీసుకోవడం వల్ల విరేచనాలు, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రం చేసుకున్న తరువాతే ఆహారం తీసుకోవాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భరత్ కుమార్, జీవన్ కుమార్, హెడ్ నర్సులు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.